
# అమ్మ - అత్త ఓ పిల్లాడు

-ర్యాలి శ్రీనివాస్



'మంచు రాతిరి - మల్లెపందిరి, పూల గంధాలు - బిత్తరచూపులు, అగరు పొగలు - ఆశల కలలు' ఇలాంటి రోజు, ఒకే ఒక్క రోజు. జీవితానికి సరిపడే రోజు. ఎంత మధురంగా ఉందీ రేయీ... మాట్లాడాలంటే కొంచెం భయం. ఎలా ప్రారంభించాలో, ఎలా మొదలుపెట్టాలో తెలియని సందిగ్ధతనే మొదటగా మాట్లాడితే బాగుండును' శ్రీకాంత్ మనసులో అనుకుంటూనే... 'ఇలారా' అని కాస్త ధైర్యంగా వెన్నెల్ని పిలిచాడు. సిగ్గుతో దగ్గరకు చేరింది వెన్నెల.

'ఈ రేయి గురించి నీ అభిప్రాయం చెప్పు'

'తొలి రేయి...' వెన్నెల సమాధానం.

'అంటే?...' తిరిగి ప్రశ్నించాడు శ్రీకాంత్. 'మీకు తెలీదా...?' అంది.

'కథలు, సినిమాలు, మాటల్లో తెలుసు' శ్రీకాంత్ సమాధానమిచ్చాడు.

'నాకూ అంతే' అంది వెన్నెల.

'ఏది ఏమైనా ఈ రేయి ఇలా నిలిచిపోతే బాగుండునేమో కదా!' శ్రీకాంత్ అభిప్రాయపడ్డాడు.

'అవును. ఒకరినొకరు అర్థం చేసుకునే రోజిదే కదా!' అంది వెన్నెల.

ఇద్దరి మధ్య దూరం తగ్గింది.

మౌనం తన పని మరిచిపోయింది.

హాయిగా మాటల పల్లకీలో నవ్వుల పువ్వులు జల్లుకుంటూ దగ్గరకు చేరుకున్నారు. శ్రీకాంత్ మరింత దగ్గరౌతున్నాడు. వెన్నెల వొదిగిపోతుంది. ఏదో కొత్త అనుభూతి. ఇద్దరికీ ఓ వింత మధురమైన అనుభూతిని కల్గిస్తుంది. శ్రీకాంత్ వెన్నెల కాంతిలో మురిసిపోతున్నాడు. 'మధురమైన జీవితమంటే ఇదేనేమో!'నని ఇద్దరూ ఒకరిలో ఒకరు లీనమైపోయారు.

* * *

'తెల్లారి ఎనిమిదైంది. ఆఫీసుకు పోవేమిట్రా?' అమ్మ గట్టిగా అరిచింది.

శ్రీకాంత్ దుప్పటి ముసుగు తీశాడు. పక్కనే చూసుకున్నాడు. నవ్వొచ్చింది. భార్య పురిటికి వెళ్ళి ఆర్నెల్లయింది. రేపోమాపో చంకన బిడ్డనేసుకొస్తుంది. 'ఇదేంటి? తొలి రేయి కల ఇలా వచ్చింది' నవ్వుకున్నాడు. పోనీలే మంచి కలేకదా! మురిసిపోయాడు. లేచి కార్యక్రమాలు మొదలుపెట్టాడు.

'ఓసారి మా ఆవిడ్ని చూసొద్దామనుకుంటున్నానే...' శ్రీకాంత్ తల్లికి చెప్పాడు. 'మొన్నే కదరా పోయి వచ్చావు. అస్తమాను తిరుగుతావెందుకు? మూణ్నెల్లు ఆగు బిడ్డనేసుకొస్తుంది' తల్లి మాటకు శ్రీకాంత్ బెంబేలెత్తిపోయాడు. అయ్యబాబోయ్ మూణ్ణెల్లే. 'నీదేం పోయిందే... నిన్ను వండి వడ్డించమన్నందుకు నాకు మంచి హితవే చెబుతున్నావ్...' మనసులో తిట్టుకున్నాడు. 'అది ఉన్నప్పుడేమో అస్తమాను ఆ అల్లరేమిట్రా? ఊసులేమిట్రా?' అంటావు. దూరంగా వుంటే వెళ్లద్దంటావు. అసలు పెళ్ళెందుకు చేశావే?' గట్టిగా కసిరాడు శ్రీకాంత్. 'అదేంట్రా... నీ పొగరు తగలెయ్యా! నాకు పెళ్ళయ్యాక మీ నాన్నతో చనువు చేయడానికి ఆర్నెల్లు పట్టింది. తీరా మాట్లాడుకునే సమయానికి మీరు తయారయ్యారు. అన్నీ చక్కబడ్డాయి కదా. తర్వాత జీవితం సుఖంగా ఉంటుందంటే ఆయన కాస్త పుటుక్కుమన్నాడు' తల్లి నిట్టూర్చింది.

'నీకు జరగనివేమీ మాకు జరగక్కూడదన్నమాట' మనసులోనే అనుకున్నాడు శ్రీకాంత్.

'ఎలాగైనా కోడలంటే లోకువే నీకు' అనేసి నాలుక కరుచుకున్నాడు శ్రీకాంత్.

'ఏడిశావ్ వెదవ. మిమ్మల్నంటే నాకేం వొరుగుతుంది. నాకదే పనా? ఏదో ఒక్కడివే అఘోరిస్తున్నావని వండి వడ్డిద్దామని వస్తే నాకు వడ్డిస్తున్నావా? నేనిప్పుడే చిన్నాడింటికి పోతాను' అని కళ్లనీళ్లెట్టుకుని పెట్టిబేడా సర్దుకోడం మొదలెట్టింది.

'అయ్యబాబోయ్... కొంప మునిగింది. నా బాధ తట్టుకోలేక ఏవేవో అనేశాను... ఉండవే... సరదాకి' అన్నాను. మళ్ళీ సముదాయించడానికి ఓ గంట పట్టింది శ్రీకాంత్‌కి.

* * *

పెళ్లై ఏడాది దాటింది. రోజులు తొందరగా జరిగిపోతున్నాయి. అనురాగాలు, అభిమానాలు మరింత బిగుస్తున్నాయి. మరల మరో నెంబరు ఇంటిలో చేరబోతుంది. ఉద్యోగంలోకి వచ్చాక భార్య సహకారం వల్ల ఇంటి పని తప్పింది. అనుబంధం పెరిగి ఎడబాటంటే కష్టంగానే ఉంది. బైక్ నడుపుతున్నా కళ్లల్లో వెన్నెలే కాంతులీనుతుంది. ఆఫీసు వచ్చేంతవరకూ శ్రీకాంత్ జ్ఞాపకాల్లోనే ప్రయాణం సాగించాడు.

ఆఫీసులో పని చేస్తున్నా జ్ఞాపకాల్లో వెన్నెల జాడలే కనపడుతున్నాయి. ఫైనల్ ఎగ్జామ్స్ రాస్తున్నప్పుడే పెళ్లిచూపులు ఏర్పాటు చేశాడు పెద్దమావయ్య. తెలిసిన సంబంధం. అన్నివిధాల బాగుంటుందని ఏదో పెళ్ళిలో మా పెళ్ళిచూపులు ఏర్పాటు చేశాడు. పెళ్లి జనమంతా అక్కడే ఉన్నారు. అందరికీ నచ్చింది. నా కోసం వచ్చింది అన్నట్టుగా వెన్నెలని అంగీకరించాను. పెళ్ళిచూపులంటే పావుగంట ఇంటర్వ్యూ. ఇద్దరి అభిప్రాయాలు సేకరించుకోవడం అనుకున్నాను. ఎన్ని చెప్పినా ఏకపక్షంగానే ఇంటర్వ్యూ సాగింది. వెన్నెల చల్లగా నవ్వడం తప్ప ప్రశ్న, సమాధానం నేనే అయ్యాను. పెళ్లయింది. చెప్పుకోలేనివి చాలా ఉంటాయి. ఇద్దరిలో అనుభవం అనేక పాఠాలు నేర్పింది. మనిషి దగ్గర లేనప్పుడు మనసు బెంగపడింది. ప్రేమ పెరిగింది. ఆలోచనలో మధ్య అమ్మ దూరింది. ఇక్కడ కూడా అమ్మే...

తల్లిపై ప్రేమ, భార్యపై ప్రేమ ఎలాగ సరిపుచ్చడం. ప్రేమ ఎక్కువై కసురుకోవడం అమ్మ దగ్గర అలవాటైపోయింది. అంతకుముందు అమ్మ కూడా ఎప్పుడూ ఏమనేది కాదు. పెళ్లాం వచ్చాకనే నాపై కసురుకోవడం ఎక్కువైంది' అనుకుంది. భార్యకి దగ్గరై అమ్మకు దూరమైపోతాననే బెంగ అమ్మ మాటల్లో కనపడుతోంది. పని సాగుతోంది. వెన్నెల గుర్తొస్తోంది. ఈ వెన్నెల మరో జాబిల్లిని తీసుకొస్తుంది. ఫోను రింగైంది తీస్తే వెన్నెలే... 'హలో... ఏం చేస్తున్నారు? నువ్వు చెప్పవోయ్? లోపల పిల్లాడెలా ఉన్నాడు?' 'పిల్లాడేనని ఎలా చెప్పగలరు?' అదంతే'నన్నాడు శ్రీకాంత్. చాలాసేపు ఫోను మాట్లాడుకున్నారు. మధ్యలో చమక్కులు ఒలకబోసుకున్నారు. నవ్వుకున్నారు. ఫోను ముగిసింది.

* * *

రాత్రి భోజనాలయ్యాక మంచం మీద వెల్లకిలా పడుకున్నాడు శ్రీకాంత్. తల్లి పని పూర్తి చేసుకుని వచ్చి పడుకుంది. 'వెన్నెల్ని అస్తమాను అదీ ఇదీ అనకే. బాధపడ్తుంది. ఏదో కాస్త సర్దుకుని ఇక్కడే ఉండిపో' మెల్లగా చెబుతున్నాడు. 'ఏమిత్రా నన్నాడిపోసుకుంటావు. ముందొచ్చిన చెవుల కంటే వెనకొచ్చిన కొమ్ములు వాడి. మీ నాన్న ఓ మాటంటేనే నే పడేదాన్ని కాదు. నిన్నకాక మొన్న వచ్చింది. కొత్తగా వచ్చిన దాన్ని కొత్తగా వచ్చినట్టుండమను. పెత్తనం చెలాయిస్తే నీ మీద చెలాయించుకో. నా మీద కాదు. నేను మాట పడను' 'అదేం కాదే నిన్ను చిన్నచూపు చూడ్డం కాదు. పెద్దదానివయ్యావు కదా! కొన్ని పనులు నీవు చక్కబెట్టలేవని చొరవ తీసుకుంటుంది. దానికి నీవేదో నిన్ను గౌరవించడం లేదనుకుంటున్నావు. చదువుకుంది. కాస్త తొందరతనం ఉంటే సర్ది చెప్పు. వింటుంది' శ్రీకాంత్ మెల్లగానే చెబుతున్నాడు.

'చదువా? వెధవ చదువు. అంతా చదువు సంస్కారం నేర్పలేదు. ఎందుకొచ్చిందీ చదువు? అదొచ్చిందంటే నేనిక్కడుండను. నాకు దానికి పడదు' సీరియస్‌గా చెప్పింది తల్లి.

'అదేంటే నీవు పెద్దదానివి. సర్దుకుపోవాలి. తెలియకపోతే చెప్పాలి. నేను పొద్దున్నపోయి సాయంత్రానికి వస్తాను. అది అలాగ నీవిలాగా. మధ్యలో నేను సతమతమౌతున్నాను గదే. ఎన్నైనా చెప్పు. నా గురించి తెలుసు కాబట్టి మీ ఆవిడకి చెప్పు. మారమను. నన్ననుసరించి నడవమను. నేను పెద్దదాన్ని. లేకపోతే నేను చిన్నోడి దగ్గరకు పోతాను.'

ఆ రాత్రి ఎన్నో ఆలోచనల మధ్యనే తెల్లారింది.

* * *

మూణ్ణెల్ల పిల్లాణ్ని తీసుకుని వెన్నెల వచ్చింది. దబ్బపండు లాంటి పిల్లాణ్ణి తెచ్చిందని తల్లి మురిసిపోయింది. అచ్చం మీ నాన్నలా ఉన్నాడ్రా వీడు. నా దిష్టే తగిలేలా ఉంది. దిష్టి తీయాలిరా ఇయ్యమ్మా వాణ్ణి' అని దగ్గరకు తీసుకుని లోపలికి తీసుకుపోయింది. పిల్లాడికిప్పుడు ఏ అవసరమైనా అమ్మే. కాళ్లపై వేసుకుని నలుగు పెట్టి నీళ్లోసింది. సాంబ్రాణి పొగ వేసింది. ఉయ్యాల కట్టి పాటలు పాడి నిద్రపుచ్చింది. అలసిపోతుంది. శ్రీకాంత్ గమనించాడు. అమ్మకి అవసరానికి ఏం కావాలో వెన్నెలని చూడమన్నాడు. ఎవరి పనుల్లో వారుంటున్నారు. పిల్లాడితో ఆడుకోడానికి సమయం వెతుక్కుంటున్నారందరూ. అత్తకీ వెన్నెలకీ మధ్య విభేదాల దూరం చాలావరకు తగ్గిపోయింది. పిల్లాణ్ణి ఎత్తుకుని పాలివ్వడం తప్ప మిగిలిన భారమంతా అత్తయ్యే మోస్తోంది. నేనెంత అదృష్టవంతురాల్ని. అత్తయ్యే లేకపోతే వీణ్ణి చక్కదిద్ది ఆయనకు సవరించడం ఎంత కష్టమైపోను. 'పెందలాడే అన్నం తినండత్తయ్యా. కాసేపు వాణ్ణి నేనాడిస్తాను. టైము పది దాటింది' 'వడ్డించేయ్ అమ్మాయి వస్తున్నాను' అంది. చక్కగా వడ్డించింది. పిల్లాడు వెన్నెల వొళ్ళో ఆడుకుంటున్నాడు. శ్రీకాంత్ ఇదంతా చూసి మురిసిపోతు



'ఏమిత్రా నన్నాడిపోసుకుంటావు. ముందొచ్చిన చెవుల కంటే వెనకొచ్చిన కొమ్ములు వాడి. మీ నాన్న ఓ మాటంటేనే నే పడేదాన్ని కాదు. నిన్నకాక మొన్న వచ్చింది. కొత్తగా వచ్చిన దాన్ని కొత్తగా వచ్చినట్టుండమను. పెత్తనం చెలాయిస్తే నీ మీద చెలాయించుకో. నా మీద కాదు. నేను మాట పడను'

న్నాడు. అమ్మ పదికాలాలు ఇక్కడే ఇలా ఉండిపోతే బాగుండుననుకున్నాడు. 'ఆఫీసు కెళ్లొస్తాన'ని వెళ్ళిపోయాడు.

* * *

'నువ్వింతేనే నువ్విక మారవు. పొద్దున్నే అత్తగారికి కాస్త వేడిగా కాఫీ తగలేద్దామని లేదు. బారెడు పొద్దెక్కినా మంచం మీంచి లేవవు. ఎందుకొచ్చిన బతుకు. అందుకే నేను పోతానన్నాను. బతిమాలి మరీ ఉండమన్నాడు మీ ఆయన. నువ్వు పురిటికి వెళ్ళి మారావనుకున్నాను. వేళకు ఏమీ ఉండవు. వాడు అరిచి గీపెట్టినా ఇంతే. ఒరే నేను ఇక్కడ ఉండలేనురా. చిన్నోడు ఒక్కడే అక్కడ కష్టపడుతున్నాడు. నే వెళ్లొస్తాను' అంతా గజిబిజిగా ఉంది. ఓ పక్క పిల్లాడు ఏడుస్తున్నాడు. వెన్నెల వంటింట్లో ఏదో చేసుకుంటోంది. అమ్మ అరిచేస్తోంది. ఒక్క ఉదుటున లేచాడు శ్రీకాంత్. మళ్ళీ కలేనా... అమ్మయ్య. కలైతే ఏ బాధా లేదు అనుకుని దుప్పటి తీసి ఆ గది నుండి బయటకు వెళ్ళాడు. తల్లి మంచం మీద పడుకుని అయ్యో బాబోయ్ అంటోంది. వెన్నెల కాలికి కాపడం పెడుతోంది. కలేదో నిజమై పోయిందనుకున్నాడు శ్రీకాంత్. ఏమైందే... అంటూ దగ్గరికి చేరి మంచం దగ్గర కూలబడ్డాడు. 'అత్తయ్యగారు మెట్ల మీద కాలుల జారి పడిపోయారు. కాలు బెణికినట్టుందండి. ఇదిగో మందు రాసి కాపడం పెడుతున్నాను. ఫర్వాలేదంటున్నారు. కాసేపాగి హాస్పిటల్‌కి తీసుకెళతాను. మీరెళ్లి రెడీ అవండి. ఆఫీసుకు టైం అవుతోంది.'

తనకొచ్చిన కలకీ దీనికీ సంబంధం లేదనుకుని ఊపిరి పీల్చుకున్నాడు. వెన్నెల అత్తకి సేవ చేయడాన్ని తానెప్పుడూ ఊహించుకోలేదు. పోనీలే అంతా మన మంచికే. అందరూ బాగుండటమే కావాలి. అమ్మ ఎప్పుడూ ఇక్కడే ఉండాలనుకున్నాడు. 'పిల్లాణ్ణి నా పక్కన పడుకోబెట్టమ్మాయ్. కాసేపు ఆడిస్తాను' అంది. వెన్నెల పిల్లాణ్ణి పక్కలో వేసింది. వాడు నాన్నమ్మతో ఆడుకున్నాడు.

సాయంత్రం ఆఫీసు నుండి వచ్చిన శ్రీకాంత్ అమ్మ లేచి తిరగడాన్ని చూసి ఆనందపడ్డాడు. వెన్నెల కంటిరెప్పలా అత్తను చూసుకుంటుంది. నాన్నమ్మతో పిల్లాడు ఆడుకుంటున్నాడు. శ్రీకాంత్ కాస్త ఊపిరి సులువుగా తీసుకున్నాడు. 'భగవంతుడా... కలలు రాకుండా చూడు స్వామి. కలలు కనడం కన్నా వీళ్లతో హాయిగా గడపటమే బాగుంది' అనుకుంటూ మంచం మీద మేను వాల్చాడు. అమ్మ కుంటుకుంటూ తన దగ్గరకు రావడాన్ని చూసి తన దగ్గరకు రావడాన్ని చూసి శ్రీకాంత్ కళ్లనీళ్లు పెట్టుకున్నాడు. తల్లి దగ్గరగా కూర్చుని బిడ్డని చూసుకుంది. వాడు తనకు దెబ్బ తగలడం వల్ల బెంబేలెత్తిపోవడం చూస్తే తన పట్ల వాడికి ఎంత ప్రేముందోనని మనసులో అనుకుని తల నిమిరింది. వెన్నెల పిల్లాణ్ణి తీసుకొచ్చి శ్రీకాంత్ చేతుల్లో పెట్టింది. తల్లి ప్రేమను పొంది పిల్లాణ్ణి ముద్దాడాడు శ్రీకాంత్.


<u>రచయిత చిరునామా</u>

**ర్యాలి శ్రీనివాస్**
**తెలుగు లెక్చరర్**
**19-13-5, హైస్కూల్ ఎదురుగా**
**రత్నంపేట, రామచంద్రాపురం**




# మొబైల్‌తో జర జాగ్రత్త

చెవుల్లో ఆ వైర్లూ గట్రా పెట్టేసుకోని ఫుట్‌పాత్‌లపై నడుచుకుంటూ వెళ్తూనే - లేదూ రద్దీ ట్రాఫిక్ లోంచి రోడ్డు దాటుతూనో - మొబైల్ మాట్లాడేస్తూ రన్నింగ్ బస్సు ఎక్కుతూనో - ఒకటేమిటి? మొబైల్ ముచ్చట్లు ఎంత విన్నవించుకున్నా విరామం ఉండదు. కమర్షియల్ బ్రేక్ ఉండదు. కానీ ఈ ధోరణికి గనుక 'బ్రేక్' వేయకపోతే ఇక జీవితానికే చరమగీతం పాడాల్సి ఉంటుందంటూ నిన్న మొన్నటి వరకూ మనస్తత్వ శాస్త్రవేత్తలు ఎన్ని నివేదికలు సమర్పించుకున్నా 'చెవిటివాని ముందు శంఖం ఊదినట్టు' మొబైల్ వైర్లు చెవుల్లో 'రింగ్ టోన్'లు వినిపిస్తూంటే ఏం వినిపిస్తుంది? ఇక వీళ్ళ చావేదో వీళ్ళని చావనివ్వమంటూ నిమ్మకు నీరెత్తని సైంటిస్టులు - తాజాగా 'ఫోన్ మాట్లాడుతూ దిక్కులు చూడకండి' అనటం మానేసి - రోడ్డు మీద వెళ్తూ 'ఎస్ ఎంఎస్'లు చేస్తే - ఇక 'సెంట్ టు హెల్' అనాల్సి వస్తుందని మొబైల్ చేస్తూ మరి చెప్తున్నారు. మొబైల్‌కీ - బైక్‌కీ అస్సలు పొంతన కుదర్దనీ, డ్రైవింగ్ చేస్తూ గనుక 'సెల్' జోలికి వెళ్తే - ఇక షార్ట్ సర్క్యూటేనని ఇలాంటివే బోలెడన్ని 'మొబైల్ సూక్తులు' చెప్పారు. అమెరికన్ కాలేజ్ ఆఫ్ ఎమర్జెన్సీ శాస్త్రవేత్తలు మరింత ముందంజ వేసి - ఈ ఎస్ఎంఎస్‌లు చేస్తూ నడవటం కానీ, బైక్ నడపటం కానీ చేయొద్దంటున్నారు. దీని అర్థ తాత్పర్యాలు ఇకనైనా తెలుసుకొని బుద్ధిగా మసలుకొంటారేమో? మొబైల్ మందబుద్ధులు.

-హెచ్.